

## అభివృద్ధిని చూసి బిఆర్‌ఎస్‌కు ఏడుపు వస్తోంది : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని బిఆర్‌ఎస్ వ్యతిరేకిస్తోందని ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణకు ఏ మంచి జరిగినా, ప్రజలకు లాభం కలిగినా బిఆర్‌ఎస్ నాయకత్వానికి బాధే మిగులుతోందని వ్యాఖ్యానించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన, రైతులకు బోనస్, రూ.21వేల కోట్లతో 25లక్షల కుటుంబాలకు రుణమాఫీ వంటి కార్యక్రమాలను కూడా బిఆర్‌ఎస్ విమర్శిస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిని వ్యతిరేకించడమే ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పందిస్తూ, మేడిగడ్డ బ్యారేజీని నిర్మించింది, డిజైన్‌లో మార్పులు చేసింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ పాలనలోనే మేడిగడ్డ కుంగిపోయిందని, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ నివేదిక ప్రకారం మేడిగడ్డ ప్రాంతం భారీ బ్యారేజీ నిర్మాణానికి అనుకూలం కాదని వెల్లడైందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీ దెబ్బతిని 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వేలాది మంది ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయాలు చేసే ప్రభుత్వం కాంగ్రెస్ కాదని స్పష్టం చేశారు.



## పాఠశాలకు సోలార్ సిసి కెమెరా విరాళం

**ప్రజాపక్షం/మాగనూరు :** వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి డెబ్బై ఏడవ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్పూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం సోలార్ సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన సుధాకర్ రెడ్డి, కృష్ణ కుమార్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సోలార్ సీసీ కెమెరాను బహుమతి గా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మన్న వినతి మేరకు పాఠశాల భద్రతను మెరుగుపరిచేందుకు ఈ కెమెరాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో బయటి వ్యక్తుల అనధికార ప్రవేశాలను అరికట్టడంతో పాటు విద్యార్థుల భద్రతకు ఉపయోగపడుతుందని పూర్వ విద్యార్థులు అన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు ముద్దు రాములు, మాజీ సర్పంచు వై.వెంకటేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుల రాములు, ఉపాధ్యాయులు నిహారిక, సోనీ తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## సమయానికి బస్సులు రాక విద్యార్థుల అవస్థలు

### జిల్లా బస్సు డిపో అధికారులు స్పందించాలి

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం శాంతినగర్ మున్సిపాలిటీ పరిధి పాఠశాల, కళాశాలలు సరైన రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శాంతినగర్ నుండి ఐజ వెళ్లే మార్గంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో విద్యార్థుల ప్రయాణం నరకంగా మారింది. సమయానికి బస్సులు రాకపోవడం, ఒక వేళ వచ్చినా ప్రయాణికులతో కిక్కిరిసిపోతుండటంతో విద్యార్థులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. బస్సు డోర్ల వద్ద వేలాడుతూ, కనీసం లోపలికి వెళ్లేందుకు కూడా స్థలం లేని పరిస్థితుల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. చదువుల కోసం ప్రతిరోజు ఇంతటి ప్రమాదకర ప్రయాణం చేయాల్సి రావడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయాణం విషయంలో ప్రభుత్వం అధికారులు రాజకీయ నాయకులు స్పందించాలి. ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరిగి వచ్చే వేళల్లో శాంతినగర్ టూ ఐజ మార్గంలో అదనపు బస్సులను నడపాలని విద్యార్థులు , స్థానికులు డిమాండు చేశారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సద్గురు అయ్యప్పస్వామి ఆటో ఫైనాన్స్ ఎంటర్ప్రైజెస్ వారు రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నాడు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం నాడు గర్భిణీ స్త్రీలు ఎక్కువగా వస్తుంటారని, రోగులు ఎక్కువగా ఉంటారని ఇండ్లలో ఎలాంటి ఆహారం తీసుకోకుండా వస్తుంటారని, వారికి ఊరట ఇచ్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా రోగులతో పాటు వచ్చిన వారికి సంబంధించిన వారికి కూడా అన్నదాన కార్యక్రమం చేసే ఉంటామని ప్రతి బుధవారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు తమ ఫైనాన్స్ సభ్యులు తీర్మానించుకున్నామని పేర్కొన్నారు. సుమారు 200 నుంచి 300 మందికి పైగా అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చామని రోగులనుంచి మంచి స్పందన లభిస్తుందని వివరించారు. రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది కూడా భోజనాలు చేస్తుంటారని ముమ్ముందు ఇంకా విస్తరించి ఎందుకు ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిట్టు వెంకటేశ్, అబ్దుల్లా, చింటూ, రాజు, రఘు, అపోలో వెంకటేశ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియ ప్రతీ ఒక్కరి బాధ్యత

### ప్రతి ఒక్కరూ సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలి

### జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీను



**ప్రజాపక్షం/మక్తల్ :** సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో పార్టీ నాయకులు, అధికారులతో తహసీల్దార్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదులో డబుల్ ఎంట్రీలు, షిఫ్టింగ్, మృతిచెందిన వారి వివరాల నమోదు వంటి తప్పులను ఆర్టిఫిషియల్ (ఎఐ) తక్షణమే గుర్తించేస్తుందని స్పష్టం చేశారు. బిఎల్‌వోలు లేదా ఇన్‌చార్జిలు ఈ ప్రక్రియలో పనిచేయడాన్ని నామోషిగా భావించకుండా బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈనెల 20వ తేదీలోపు ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. జులై 31న వెలువడే జాబితాతో బిఎల్‌ఒలు, ఇన్‌చార్జీల పనితీరు వెల్లడవుతుందని, దాన్ని బట్టి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ నాటికి ప్రభుత్వం నిర్దేశించిన పనులను పూర్తి చేస్తే, రాబోయే రెండు నెలలు బిఎల్‌ఒలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక తహసీల్దార్లకు లేదా నేరుగా తనకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఈ సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### మార్కెట్ చైర్మన్ దండు నరసింహ



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రజా ప్రభుత్వ పాలనలో రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మార్కెట్ చైర్మన్ దండు నరసింహ అన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్యం, మార్కెట్ చైర్మన్ దండు నరసింహ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వై.యస్.రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా రైతు సంక్షేమ కార్యక్రమాలను అభినందిస్తూ డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.సత్యం, దండు నరసింహ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వ సంస్థలైన ఐకెపి, పిఎసిఎస్ ద్వారా కొనుగోలు చేసి, చెల్లింపులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వల్ల రైతులకు ఆర్థిక భరోసా కలిగిందని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మొట్టే కుర్మయ్య, వెంకటమ్మ, వెంకటయ్య, బాలు నాయక్, మాజీ సర్పంచులు కొండల్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు, డి.రవికుమార్, వెంకటస్వామి గౌడ్, ఉపసర్పంచు కొత్త రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు, మేకల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు శివ, రాజేశ్వరరావు, కొల్లాపూరు యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఎం.డి.రసూల్, బ్యాగరి మల్లేష్, రామస్వామి, ముష్టిపల్లి శ్రీను, క్రాంతికుమార్, ముచ్చపోతు శంకర్, బొల్లె విష్ణు, రాజు, వెంకటయ్య, సాయి, రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే డబ్లింగ్ పనులకు భూసేకరణ పూర్తిచేయాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** రైల్వే డబ్లింగ్ పనులకు జిల్లా పరిధిలో కావాల్సిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఇరిగేషన్, రైల్వే లైన్ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై బుధవారం ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనగా జోగులాంబ గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు చేపడుతున్న డబ్లింగ్ రైల్వే లైన్ పనులకు జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 104 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే సంబంధిత రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున త్వరలోనే అవార్డు పూర్తి చేయాలన్నారు. అవార్డు పూర్తికాగానే రైల్వే అధికారులకు ఈ భూమిని అప్పగించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఈ భూమిని అప్పగించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.21వేల ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని కొర్లకుంట గ్రామానికి చెందిన వనం సింధుజ ప్రైవేట్ ఆసుపత్రిలో సిజేరియన్ ప్రసవం చేయించుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి రూ.21,000 విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కును మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును కొర్లకుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.గోపాల్ నాయక్, ఎం.నరసింహ నాయక్, సింధుజ తల్లి ప్రసన్న లక్ష్మి కి అందజేశారు. ఈ సందర్భంగా వనం సింధుజ, ప్రసన్న లక్ష్మి రాష్ట్ర ముఖ్యమంత్రికి , మంత్రి జూపల్లి కృష్ణారావుకు అలాగే తమకు సహకరించిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/వెల్దండ :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గంగపురం చిన్నయ్య రూ.34,500లు మాడ్గుల శ్రీశైలం రూ.14వేల చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసినట్లు కేశమల్ల కృష్ణ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తమకు ఆర్థిక చేయూత అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బతండా శ్రీనునాయక్, అనిల్‌కుమార్, హర్యనాయక్ పాల్గొన్నారు.

## దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కారణజన్ముడు

### రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/వనపర్తి :** మరణించినా ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కారణజన్ముడు దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమాలలో పర్యటించేందుకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక శాసన సభ్యుడు మేఘారెడ్డితో కలిసి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.
దివంగత నేత, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేనా రెడ్డి అధ్యక్షతన జయంతి వేడుకలను నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఆ చిత్రపటానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక , క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక శాసనసభ్యుడు మేఘారెడ్డి, వనపర్తి డిసిసి చీఫ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.
ఈ సందర్భంగా డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ రైతు పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రారంభించిన మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలతో కోట్లాది కుటుంబాలకు భరోసా కల్పించిన గొప్ప నాయకుడిగా చరిత్రను నిలిచి పోయారని గుర్తుచేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయిచరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మాజీ డిసిసి అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మండలాధ్యక్షులు నక్క రవి, కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలి

### ఎఐటియుసి డిమాండ్

### నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/నారాయణపేట :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం 26వేలకు పెంచి తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నారాయణపేట జనరల్ ఆసుపత్రి బ్రాంచ్ నేతలు శ్రీనివాసులు, యాదేశ్, ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కనీస వేతనం 26 వేలకు పెంచాలని పిఎఫ్ ఇఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, ఒక నెల వేతనం బోనస్ చెల్లించాలని జాతీయ పండుగ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండు చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నేతృత్వంలో బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ కళాశాల ఎదుట పారిశుద్ధ్య పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు శ్రీనివాసులు, యాదేశ్, ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏజేన్సీ వ్యవస్థను రద్దు చేసి, కార్పోరేషన్ నెలకొల్పి కార్మికులకు నేరుగా వేతనాలు ప్రభుత్వమే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటరీ భద్రత రోగి సంరక్షణ కోసం ప్రభుత్వం ఏజేన్సీలను మూడు సంవత్సరాల కాల వ్యవధిలో ఎంపిక చేసే పాలసీ కొనసాగుతుందని ప్రస్తుతం నడుస్తున్న ఏజేన్సీ మూడు సంవత్సరాల వ్యవధి ముగిసి ఏడాది గడిచిపోయిందని దీంతో కార్మికులకు వేతనాలు పెరగకపోగా కార్మికులపై అదనపు పని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవత దృక్పథంతో కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు శ్రీనివాసులు, యాదేశ్ రమేష్, లక్ష్మణ్, వెంకటేశ్, ప్రకాశ్, భీం రెడ్డి, ప్రవీణ్, అశ్విని, మహేశ్వరి, మాధవి, ప్రగతి పద్మ, లక్ష్మి , శ్వేత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సూచనల మేరకు 'సర్'



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని 6వ వార్డులో సర్ ఎన్యూమరేషన్ ఫారం 6వ వార్డు ప్రజలకు బిఆర్‌ఎస్ పార్టీ బిఎల్‌ఏ ఇన్‌చార్జిలు, మాజీ కౌన్సిలర్ చింతలపల్లి సంధ్యా రవీందర్ రెడ్డి మద్దిగట్ల బాలకృష్ణారెడ్డి కొమ్ము రవి కుమార్ 243 బూత్ బిఎల్ఓ వనజ సమక్షంలో ఎస్ఐఆర్ ఫారమ్ ఫిలప్ పూర్తి చేసుకున్న వారి పత్రాలను అందజేశారు. అలాగే ఫామ్ ఫిలప్ చేయడానికి అర్థం కాక ఇబ్బంది పడుతున్న ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నేటి వరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫామ్‌లను బిఎల్‌ఓకి అందజేయడం జరిగింది. అలాగే వార్డులో ఎక్కడైనా ఇప్పటివరకు ఇంటి అడ్రస్‌లు గుర్తించకఫామ్‌లు అందని వారి వివరాలు తెలుసుకుని సమాచారం ఇవ్వడంతో పాటు వార్డులోని ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమం వేగంగా పూర్తి చేసి బూత్ నెంబర్ 243 బిఎల్‌ఓ బిఎల్‌ఏ లకు సహకరించగలరని 6వ వార్డు ప్రజలను కోరడం జరిగింది.
ఈ కార్యక్రమంలో 6వ వార్డు మాజీ కౌన్సిలర్ చింతలపల్లి సంధ్యా రవీందర్‌రెడ్డి, సింగల్ విండో మాజీ డైరెక్టర్ మద్దిగట్ల బాలకృష్ణారెడ్డి, కొమ్ము రవి కుమార్, బిఎల్‌ఓ మద్దిగట్ల వనజ, ఆశిరెడ్డి, రాములు యాదవ్, తయ్యబ్, కాలనీవాసులు, ఈనాటి ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతు బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/గట్టు :** మండలంలోని చాగాదోన గ్రామంలో బుధవారం బాధిత కుటుంబానికి రైతు బీమా చెక్కును అందజేశారు. గ్రామస్థుల కథనం మేరకు గ్రామానికి చెందిన రైతు వరుగు వెంకటేశ్వర్లు తీవ్ర అనారోగ్యంకు గురై ఇటీవల మృతి చెందారు. ఆయనకు రైతు బీమా ఉండటంతో ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షలు విడుదల య్యాయి. దీంతో మాజీ ఎంపిపి విజయకుమార్ బాధిత కుటుంబానికి భీమా చెక్కును అందజేశారు.
ఈ కార్యక్రమంలో సర్పంచు వీరేష్ పాల్గొన్నారు.



## విద్యాభివృద్ధి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

### జులై 10న విద్యా సంస్థల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ పిలుపు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జులై 10న కేజీ నుంచి పిజి వరకు విద్యా సంస్థల బంద్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి బుధవారం ప్రకటించింది. ఈ బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ, మహిళా విద్యార్థుల భద్రత వంటి పలు సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలని, ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణకు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతీ విద్యా సంస్థల్లో మహిళా భద్రత కోసం ఐసిసి కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, జాతీయ విద్యా విధానం 2020 అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం చేపట్టిన జులై 10న విద్యా సంస్థల బంద్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా అందరూ మద్దతు తెలపాలని ఎఐఎస్‌ఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు వంశీ, ప్రవీణ్, ప్రశాంత్, విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.





## ఇవిఎంల కోసం భూటాన్, ఇసిఐఎల్ అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** భూటాన్ ఎన్నికల సంఘానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సరఫరా చేసేందుకు భూటాన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ దేకి పెమా, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఇసిఐఎల్) కంపెనీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల కోసం ఇసిఐఎల్ టెక్నికల్ డైరెక్టర్, సిఎండి శాస్త్రవేత్త, సిఎండి డాక్టర్ అనేస్‌కుమార్ శర్మ, భూటాన్ ఎలక్షన్ కమిషనర్ సోనం పెల్డెన్‌లు ఒప్పందం కుదుర్చుకున్నారు. భారత్, భూటాన్ మధ్య ద్వైపాక్షిక ఎన్నికల సహకారాన్ని బలోపేతం చేయడంలో ఈ అవగాహన ఒప్పందం ఒక ముఖ్యమైన ముందడుగు అని, భూటాన్‌లో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పారదర్శక ఎన్నికల నిర్వహణకు తోడ్పడేందుకు ఇసిఐఎల్ అత్యాధునిక ఇవిఎంలను సరఫరా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిబి డైరెక్టర్ గోవిందసుబేది, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సోనమ్ వాంగ్డా, ఇసిఐఎల్, ఇవిఎం విభాగం ఇన్‌చార్జ్, లెఫ్టినెంట్ కల్నల్ ఆర్‌ఎస్ బైన్స్(రిటైర్డ్)లు ఉన్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం : తుంకి రమేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతు భరోసా పథకంలో రైతులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు అలియాబాద్‌లోని రైతు వేదికలో బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని రైతులను రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని రైతులను అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపిటిసి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్ల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు బాబు, దినేష్, సాయికృష్ణ, రాంప్రసాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్ డిజి స్కూల్ సీజ్ చేసిన విద్యాశాఖాధికారులు

### అనుమతులు లేకుండా మరో ప్రాంతానికి మార్చటమే కారణం

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఒక ప్రాంతంలో అనుమతులు తీసుకొని మరో ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ ప్రయివేట్ పాఠశాలపై జిల్లా విద్యాశాఖ కొరడా ఝుళిపించింది. ఈ పాఠశాలను సీజ్ చేయటంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలను సైతం సీజ్ చేసారు. ఉప్పల్ మండలం నాచారం సమీపంలోని ఎస్‌ఆర్ డిజి స్కూల్ హెంఎంటి నగర్



బాలాజినగర్ పాఠశాల యాజమాన్యం విద్యాశాఖ నుండి అనుమతులు తీసుకోకుండా నాచారం సమీపంలోని బాబానగర్‌లోని విఎస్‌నగర్ ప్రాంతానికి మార్చారు. ఈ విషయంపై సమాచారం అందుకొన్న ఉప్పల్ మండల విద్యాశాఖాధికారి వెంటనే నోటీసు ఇచ్చినప్పటికి ఎలాంటి జవాబు ఇవ్వక పోవటంతో డిఇఒ రేణుకాదేవి గత నెల 30న జారీ చేసిన ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఎంఇఒ పాఠశాలను సీజ్ చేసారు. దీంతో పాటు విద్యార్థులకు అమ్మేందుకు సిద్ధంగా సంచుల్లో ఉన్న పాఠ్యపుస్తకాలను సైతం సీజ్ చేసారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థ యాజమాన్యాలు కొనసాగిస్తున్న వైనం పై విద్యాశాఖ తీసుకొన్న చర్యల పట్ల ఎఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ సమితి హర్షం వ్యక్తం చేసింది. ఇదే విధంగా జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల అక్రమాల పట్ల కఠినంగా వ్యవహరించాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, అలీ, సుధీర్, కిరణ్‌లు డిమాండ్ చేసారు.



# పోలీసు స్టేషన్ స్థలాన్ని కాపాడిన హైడ్రా !

### ఆక్రమణలు తొలగించి, 6 గుంటల భూమికి ఫెన్సింగ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏకంగా పోలీసు స్టేషన్ ఏర్పాటు కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్నే కబ్జాదారుల బారి నుండి హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఓ విలువైన భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా బృందాలు బుధవారం నేలమట్టం చేశాయి. రంగారెడ్డి జిల్లా ఉప్పల్ మండలం కొత్తపేట్ గ్రామంలోని సర్వే నెంబర్లు 135, 136లలో గల 6 గుంటల భూమిని చైతన్యపురి పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. ఇందులో సర్వే నెంబర్ 135లో 4 గుంటలు, సర్వే నెంబర్ 136లో 2 గుంటల స్థలం ఉంది. అయితే, సర్వే నెంబర్ 135లోని 4 గుంటల ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొందరు స్థానిక కబ్జాదారులు, అందులో అక్రమంగా షెడ్‌లను నిర్మించారు. ఈ విషయంపై చైతన్యపురి పోలీసులు స్పందిస్తూ, పోలీసు స్టేషన్ కోసం కేటాయించిన స్థలంలో ఆక్రమణలను తొలగించి, భూమిని కాపాడాలని హైడ్రా అధికారులను కోరా రు.

**క్షేత్రస్థాయి పరిశీలన – క్షణాల్లో యాక్షన్!**
పోలీసు శాఖ నుంచి వచ్చిన విజ్ఞప్తిపై హైడ్రా అధికారులు తక్షణమే స్పందించారు. వివాదాస్పద స్థలా న్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అది ప్రభుత్వ భూమేనని, అక్రమంగా కబ్జా కు గురైందని ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. బుధవారం ఉదయాన్నే భారీ బందోబస్తు నడుమ హైడ్రా బృందాలు కొత్తపేట్‌లోని సదరు స్థలానికి చేరుకున్నాయి. కబ్జాదారులు నిర్మించిన షెడ్‌లను జెసిబిల సహాయంతో పూర్తి గా తొలగించి, భూమిని స్వాధీనం చేసుకున్నా యి.




**తిరిగి ఆక్రమించకుండా ఫెన్సింగ్, బోర్డులు :** భూమిని స్వాధీనం చేసుకోవడమే కాకుండా, భవిష్యత్తులో మళ్లీ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా హైడ్రా ముందస్తు చర్య లు చేపట్టింది. సర్వే నెంబర్లు 135, 136 పరిధిలోని మొత్తం 6 గుంటల స్థలానికి చుట్టూ గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా, 'ఇది పోలీసు స్టేషన్ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి' అని స్పష్టం చేస్తూ అక్కడ హెచ్చరికా బోర్డులను కూడా పాతారు. హైడ్రా తీసుకున్న ఈ తక్షణ చర్యపై స్థానికులతో పాటు పోలీస్ శాఖ హర్షం వ్యక్తం చేసింది.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

**ప్రజాపక్షం/వికారాబాద్:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన ఘటన వికారాబాద్ మున్సిపల్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిఐ రఘు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ పట్టణంలోని రాజీవ్‌గృహకల్పలో 17ఏళ్లుగా రాజేశ్, వనిత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 16ఏళ్ల కుమారుడు ఉన్నాడు. మూడేళ్ల క్రితం చేవేళ్లమండలం హస్తేపూర్‌కు చెందిన వడ్డే శ్రీనివాస్ వికారాబాద్‌లో పనిచేసే చోట రాజేష్‌తో పరిచయం ఏర్పడింది. వీరిస్నేహం ఇంట్లోనే మద్యం సేవించేవరకు వచ్చింది. మద్యం తాగిన తర్వాత భర్త వేధించడం అడ్డొచ్చిన కుమారుని సైతం కొట్టడంతో రాజేష్‌ను అడ్డు తొలగించుకోవాలని భార్య కొడుకు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మార్చి నెలలో మద్యం తాగుదామని చెప్పి బైక్‌పై రాజేష్‌ను ఎక్కించుకొని హసేపూర్ శివారులోని ఓ వ్యవసాయ బావి దగ్గరికి తీసుకెళ్లారు. ముందుగా మద్యంలో కలుపుకొనేందుకు నీటిని బావిలోనుంచి తీసుకురమ్మని చెప్పడంతో రాజేష్ బావిలో దిగుతుండగా ఒక్కసారిగా శ్రీనివాస్ బావిలో తోసేశాడు. మార్చి 30న బావిలో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. రెండు నెలల క్రితం మృతుడు రాజేష్ అన్న కుమారుడు సాయికుమార్ ఫోన్ చేయగా ఏదో ఒకటి సర్ది చెప్పుకుంటు వచ్చారు. అనుమానం వచ్చిన సాయికుమార్, గృహకల్పకు చేరుకునని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఈనెల 2న వికారాబాద్ పిఎస్‌లో ఫిర్యాదుచేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. 2013లో వనీత భర్తపై హత్యయత్నం చేసినట్లు నమోదైంది. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. మార్చి 30న లభ్యమైన గుర్తు తెలియని లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం రాజేష్‌దిగా గుర్తించడంతో నిందితుడు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. ఈమేరకు పోలీసులు శ్రీనివాస్‌ను హత్యకు ప్రోత్సహించిన కొడుకుని రిమాండ్‌కు తరలించారు. అనిత ప్రభుత్వ ఆసుపత్రిలో అడబిడ్డకు జన్మనించింది. 3నుండి 8వ తేది వారకు పోలీసులు కాపలాగాఉన్నారు.



## అక్రమ వైన్ తయారీ గుట్టురట్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఓ ఇంట్లో అక్రమంగా వైన్ తయారు చేస్తున్న ఓ వృద్ధుడి గుట్టును మల్కాజ్‌గిరి డిటిఎఫ్ పోలీసులు రట్టు చేశారు. వృద్ధాప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషించే క్రమంలో ఈ అక్రమ దందాకు తెరలేపిని నేరేడ్‌మెట్‌కు చెందిన అంటోనీ ఫీటర్(65)అనే వ్యక్తిని కాప్రాలో ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న అధికారులు పట్టుకున్నారు. వివిధ రకాల పండ్లతో తయారు చేసి ఒక్కో బాటిల్ 300 రూపాయలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో మొత్తం 377.7లీటర్ల అక్రమ వైన్, 502 బాటిళ్లు స్వాధీనం చేసుకుని వైన్‌కు ద్రాక్ష, అనాస పండు, జామ, మోసంబి, సపోటా, అరటి, తమలపాకు వంటి ఏడు రకాల పదార్థాలతో కిణ్వ ప్రక్రియ ద్వారా తయారు చేసిన్నట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వైన్‌తో పాటు తయారీకి ఉపయోగించిన సామగ్రిని పంచనామా నిర్వహించి అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదుతో తదుపరి దర్యాప్తుకోసం కాప్రా ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు.

## భూగర్భ డ్రైనేజీ పనులకు చైర్ పర్సన్ శంకుస్థాపన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిలోని యాడారం, తుర్కపల్లి వార్డుల్లో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి భూగర్భ డ్రైనేజి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి బుధవారం శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు రూ.7 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశామని చెప్పారు. మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హనుమాన్‌దాస్‌గౌడ్, యూసుఫ్, మున్సిపల్ ఎఇఇ సనా షాహిన్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు 800 విత్తన ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ :** మండల పరిధిలోని నారాయణపూర్ రైతు వేదిక లో వికారాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ ,వైస్ చైర్మన్ మల్లేశం, ఎఓప్రసన్న లక్ష్మి తో కలసి రైతులకు కాటన్ ప్రొటక్టివిటి మిషన్ పథకం కింద 200ఎకరాలకు 800 ప్యాకేట్లు ప్రభుత్వం కేటాయించడం జరిగింది. ఈ పథకం రైతులు సద్వినియోగం చేసుకొని క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు చేపట్టి అధిక దిగుబడులు , మెరుగైన ఆదాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు, పాల్గొన్నారు.





## తక్షణమే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### కె.రవిచంద్రన్ పిలుపు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** అల్వాల్ మండలం యాప్రాల్‌లో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న ఎఐటియుసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రవిచంద్రన్ పిలుపునిచ్చారు. బుధవారం యాప్రాల్ బస్టాండ్ ఆవరణలోని భవన నిర్మాణ కార్మిక అడ్డాలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.రవిచంద్రన్ మాట్లాడుతూ, రాబోయే జిల్లా మహాసభల్లో కార్మికులు, కర్షకులు, మేధావులు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కార్మికుల సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు. తక్షణమే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. కార్మికులకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలి. అసంఘటితరంగ కార్మికులకు నెలకు కనీసం 9,000 రూపాయల పెన్షన్ అందించాలి. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి ద్వారా వచ్చే ఫలాలు సక్రమంగా అందేలా చూడాలి. కార్మికులందరికీ ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కచ్చితంగా అమలు చేయాలి. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు 30 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు రమేష్ సింగ్, అల్వాల్ పట్టణ పార్టీ కార్యదర్శి అమరావతి బాబు, వై.వెంకటేష్, నరేంద్ర చారిలతో పాటు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉష ముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజులరామారం వరకు చేపడుతున్న 100 అడుగుల ప్రధాన రహదారి విస్తరణ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా మధ్యలో ఉన్న బండరాళ్ల తొలగింపు, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ స్తంభాల స్థాన మార్పు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే ఆల్విన్‌కాలనీ, శంషీగూడ ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గి, సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, జిల్లా గణేష్, ఇస్మాయిల్, నాగేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్ నివారణలో వికారాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా ఎయిడ్స నివారణ, నియంత్రణ, చికిత్సలో జాతీయ స్థాయిలో వికారాబాద్ జిల్లా ఉత్తమ పనితీరు కనబరిచినట్లు జిల్లాలకు అందజేసే సాక్ష్యం సర్టిఫికెట్‌ను పొందడం జరిగిందని జిల్లా కలెక్టర్‌దీపక్‌తివారి అన్నారు. వికారాబాద్ వైద్యఆరోగ్యశాఖ ఉత్తమ పనితీరు కనబరిచిందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి సుధాకర్‌లాల్ అందజేశారు. నిర్దేశించిన లక్ష్యాలలో భాగంగా మన జిల్లాలో ఎచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తుల్లో కనీసం 95 శాతం మందికి తమ ఎచ్ఐవి స్థితి తెలిపిఉండడం ఇందులో ఎచ్ఐవితో జీవిస్తున్న 4,536మందినిగుర్తించడం జరిగింది. వారికి యాంటిరెట్రో వైరల్ థెరపీ చికిత్స అందించడం జరిగినది. ఈలక్ష్యం సాధించడం రాష్ట ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాతీయ, ఎఆర్‌టిపరీక్ష, చికిత్సకేంద్రాలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్త లు పాత్ర ఎంతో ఉందన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# వైఎస్‌ఆర్ పాలన చిరస్మరణీయం

### పలు చోట్ల డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** వైఎస్‌ఆర్ ప్రజా సంక్షేమ పాలన చిరస్మరణీయమని డా.సత్యం శ్రీరంగం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు బుధవారం బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరై వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన మహానేత వైఎస్‌ఆర్ అని కొనియాడారు. ఆయన దూరదృష్టికి, ప్రజా సంక్షేమ పాలనకు ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, రెండు రూపాయల బియ్యం వంటి పథకాలు చిరస్మరణీయ చిహ్నాలుగా నిలిచాయని అన్నారు. ఇవి కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే కాకుండా పేదలపట్ల ఆయనకు ఉన్న ఆప్యాయత, సేవాభావానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిజమైన ఇందిరమ్మ రాజ్యాన్ని పేదవాడి గడప వరకు తీసుకెళ్లిన నాయకుడు వైఎస్‌ఆర్ అని అన్నారు. వైఎస్‌ఆర్ ఆశయాలను ప్రతి నాయకుడు ఆదర్శంగా తీసుకుని ప్రజల కష్టసుఖా ల్లో భాగస్వామిగా నిలిచి సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల దేశాల్, ఎండి మొయిజ్, సాధు ప్రతాప్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, దెండి అరవింద్‌రెడ్డి, స్వరూపగౌడ్, తదితరులు పాల్గొన్నారు.











**జవహర్ నగర్‌లో :** జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా సోదరీమణులు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సదానందం, మాజీ కార్పొరేటర్లు కుతాడి సాయి కుమార్, జమాల్పూర్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజి అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, అశోక్ గుప్తా, మహిళా నేతలు, కార్యకర్తలు వైయస్సార్ అభిమానులు. వైయస్సార్ కు నివాళులు అర్పించారు.

**శామీర్‌పేటలో :** శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని వైఎస్సాఆర్ చౌరస్తాలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి భారీ పూలమాలను వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు యాప్కి శంకర్‌గౌడ్, ఇలాసాగరం అశోక్, మాజీ ఎంపిటిసి మ్యాకల మహేందర్‌యాదవ్,నాయకులు ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, వాసురెడ్డి, టిఆర్ రవీందర్‌గౌడ్, ఆనంద్, బిక్షపతి, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళులు కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా పథకం కింద 68లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ 7,500కోట్ల నిధులు జమ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కార్యదర్శి మామిళ్ళ ముత్యాలు యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డిలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ అధ్యక్షుడు కొంతం అంజి రెడ్డి, గోపాల్‌రెడ్డి, అబ్దుల్ ఖయ్యూం, బొక్క సంజీవ రెడ్డి,సురేష్ నాయక్, బర్ల దేవేందర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు,

**నిజాంపేట్‌లో:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ కమాన్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డిలు విచ్చేసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ని కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**షాపూర్ నగర్ చౌరస్తాలో ...**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ చౌరస్తాలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

